సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



అబిడ్స్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన పలు కుటుంబాలకు విడుదలైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్, సతీష్ గౌడ్, అశోక్ జైన్, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



అఫ్జల్‌గంజ్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. శనివారం అఫ్జల్‌గంజ్, గౌలిగూడ రామ్‌మందిర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ..నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే ఆయా ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ కులశేఖర్, నాయకులు రాజు యాదవ్, లక్ష్మీనారాయణ, సాయిరామ్ యాదవ్, వామన్‌రాజు, మారుతి, మంజుల, పార్వతి, మోహన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పునాదులకే పరిమితం..

- ముందుకు సాగని ముర్గీచౌక్ పునర్నిర్మాణం పనులు
- నిజాం కాలం నుంచి కొనసాగిన ముర్గీచౌక్
- శిథిలావస్థకు చేరుకోవడంతో గత ప్రభుత్వంలో రూ.36 కోట్ల నిధులు మంజూరు
- 2022లో నిర్మాణం పనులను ప్రారంభించిన కేటీఆర్



పునాదుల వద్దే నిలిచిపోయిన పనులు

చార్మినార్: నిజాం కాలం నాటి ముర్గీచౌక్‌ను ఆధునాతన సౌకర్యాలతో పునర్నిర్మించడానికి నిధులు మంజూరైనప్పటికీ..ఇంకా పనులు మాత్రం కొనసాగడం లేదు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ 2022 ఏప్రిల్ 19న నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయగా..పునాదుల వద్దే నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నిధుల కొరత లేకున్నా.. పనుల ప్రారంభంలో జాప్యం జరుగుతోంది. చార్మినార్–లాడ్‌బజార్‌కు సమీపంలోని ఖిల్వత్ వద్ద 1930లో నిర్మించిన ఈ ముర్గీచౌక్ భవన సముదాయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ భవన సముదాయాన్ని పూర్తిగా నెలమట్టం చేసి గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తును నిర్మించడానికి జీహెచ్ఎంసీ ప్రణాళికలు రూపొందించింది. నిర్మాణ పనుల కోసం జేఎన్‌టీయూ ఆర్కిటెక్చర్ విభాగం నిపుణుల బృందం ముర్గీచౌక్‌ను సందర్శించి సమగ్ర నివేదికను రూపొందించింది. దీని ప్రకారం జీహెచ్ఎంసీ అత్యంత ఆధునాతనమైన సౌకర్యాలతో ముర్గీచౌక్‌ను పునర్నిర్మించడానికి ఏర్పాట్లు చేసి పాత భవన సముదాయాన్ని కూల్చి వేసింది. కూల్చిన వెంటనే పనులు ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ..పునాదుల వద్దే నిలిచిపోయింది.

రూ.36 కోట్లు మంజూరు..

ముర్గీచౌక్ పునర్నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.36 కోట్లను మంజూరు చేసింది. ముర్గీచౌక్ భవన సముదాయాన్ని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి సందర్శించి సాధ్యమైనంత వెంటనే పనులు ప్రారంభించాలని అప్పటి మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ కూడా ముర్గీచౌక్ భవన నిర్మాణం సముదాయాన్ని ఆమోదించింది. దీంతో గత కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరిన ముర్గీచౌక్ పునర్నిర్మాణమై రాబోయే రోజుల్లో ఆకర్షణీయమైన భవనంగా ఏర్పడనుందని పాతబస్తీ ప్రజలు, ఇక్కడి వ్యాపారులు భావించారు. కొన్ని సాంకేతిక కారణాలతో భవన సముదాయ నిర్మాణం పనులు ఆలస్యమవుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

ముర్గీచౌక్‌గా మారిన మహబూబ్ చౌక్...

నిజాం కాలంలో మోజంజహీ మార్కెట్‌తో పాటు మహబూబ్ చౌక్ నిర్మాణం జరిగింది. చార్మినార్‌కు కూతవేటు దూరంలో నిర్మింపబడిన మహబూబ్‌చౌక్‌లో మొదట్లో పురాతన వస్తువులతో పాటు పక్షులు, గ్రాజరీ ఐటమ్స్‌లను విక్రయించేవారు. రాను రాను కోళ్ల విక్రయాలు మొదలయ్యాయి. ఉర్దూలో కోళ్లను ముర్గీ అంటారు. దీంతో మహబూబ్ చౌక్ ముర్గీచౌక్‌గా మారింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ముర్గీచౌక్‌గా కొనసాగుతున్న మహబూబ్ చౌక్‌ను పునర్నిర్మించనున్నారు. ముర్గీ చౌక్‌లో నాలుగు బ్లాక్‌ల్లో జీ ప్లస్ వన్ భవన సముదాయాల్లో 292 షాపులను నిర్మించనున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

సుల్తాన్‌బజార్: బస్తీ దవాఖానాలో పనిచేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ బస్తీ దవాఖానా కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష కార్యదర్శులు మంగళపాటి సుమన్, అంజాద్ అలీఖాన్ మాట్లాడుతూ.. బస్తీ దవాఖానా సపోర్టింగ్ స్టాఫ్‌కు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు ఇప్పించాలని, ప్రతి నెలా సక్రమంగా వేతనాలు చెల్లించేలా చొరవ చూపాలని కోరినట్లు తెలిపారు. ఏజెన్సీ విధానం రద్దు చేసి కార్పొరేషన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. తమ సమస్యలపై ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఉప్పలయ్య, శ్రీనివాస్, శాంతమ్మ, పావని, మహేష్, సాయిగోవర్ధిని తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ శిలలను పరిరక్షించుకుందాం



చరిత్రకారులు, విద్యార్థులతో ఆచార్య వెలుదండ నిత్యానందరావు

నాంపల్లి: వారసత్వ శిలలను పరిరక్షించుకుందామని తెలుగు యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర, సంస్కృతి, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చరిత్ర పరిరక్షణలో భాగంగా శనివారం తెలుగు వర్సిటీ ప్రాంగణంలో గల విభిన్న ఆకృతులున్న రాతి శిలల సమీపంలో ప్రాకృతిక శిలలను కాపాడుకుందాం అనే శీర్షికన ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ..ప్రతి విద్యార్థి తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకునే విధంగా చరిత్ర గ్రంథాల సూచికలను తయారు చేయాలన్నారు. ఇది భవిష్యత్ చరిత్రకారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని హితవు పలికారు. దేశ వారసత్వ సంపదను విచ్ఛిన్నం చేయరాదని, అది ప్రకృతిలో అంతర్భాగమని ప్రముఖ చరిత్ర కారులు, చరిత్ర, సంస్కృతి, పర్యాటక శాఖ ఆచార్యులు డాక్టర్ శ్రీనివాసన్ అన్నారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ మహేందర్ రెడ్డి, చరిత్ర శాఖ శాఖాధిపతి డాక్టర్ వనజా ఉదయ్ పాల్గొన్నారు.

23న క్రీడా పోటీలు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు విద్యతో పాటు క్రీడా సాంస్కృతిక విభాగాలలోనూ భాగస్వాములు కావాలని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వెంకట రాజశేఖర్ అన్నారు. శనివారం నిజాం కళాశాలలో ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీలలో నిర్వహిస్తున్న యువ ఎంపవర్ 2025 పేరిట నిర్వహిస్తున్న పోటీల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయిస్టర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సునీల్ మాట్లాడుతూ..స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ పోటీలలో పాల్గొనదలచిన వారు 95051 55506, 63048 12284 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హబీబ్‌నగర్‌లో చికెన్ వ్యాపారిపై దాడి

నాంపల్లి: ముర్గీ మార్కెట్‌లో కిరాయి మూకలు రెచ్చిపోయాయి. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి ముర్గీ మార్కెట్‌లో యూనుష్ ఖాన్(50) అజీజ్ ఖాన్ చికెన్ సెంటర్‌ను నడుపుతున్నారు. ఈ దుకాణానికి ఎదురుగా ఆసిఫ్‌నగర్‌కు చెందిన అఫ్సర్ ఖాన్ అనే వ్యాపారికి ఓ చికెన్ సెంటర్ ఉంది. ముర్గీ మార్కెట్‌లో ఇరువురి మధ్య చికెన్ వ్యాపారం చిచ్చుపెట్టింది. ఈ వ్యాపారం కారణంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. పాత కక్షల నేపథ్యంలో అఫ్సర్ ఖాన్ సుమారు 30 మంది కిరాయి మూకలతో యూనుష్ ఖాన్ దుకాణంపై 15న రాత్రి దాడి చేయించారు. యూనుష్ ఖాన్ చనిపోయాడని భావించి వారు అక్కడి నుంచి పరారయ్యారు. యూనుష్ ఖాన్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రాణాపాయం నుంచి అతడు బయటపడ్డారు. బాధితుడు దాడికి పాల్పడ్డ వారిపై హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పని చేసే వారికే కాంగ్రెస్‌లో పదవులు



మాట్లాడుతున్న ముంగి రఘుపాల్‌రెడ్డి

గోల్కొండ: పని చేసే వారికే కాంగ్రెస్‌లో పదవులు దక్కుతాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముంగి రఘుపాల్‌రెడ్డిఅన్నారు. శనివారం ఆయన నేతాజీనగర్‌లోని తన కార్యాలయంలో పలువురు కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ నియామకంపై చేస్తున్న విమర్శలపై ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ మారుతూ కాంగ్రెస్‌లోకి చేరిన వారు పదవులు ఆశించడం ఎంత వరకు సబబుఅని ప్రశ్నించారు. మార్కెట్ కమిటీ పాలక మండలిలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుందన్నారు. మరోవైపు కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల నుంచి సైతం మొత్తం ముగ్గురిని కమిటీలో సభ్యులుగా నియమించడం జరిగిందన్నారు. ఈ మార్కెట్ కమిటీ పాలకమండలి కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాదన్న విషయం వారికి తెలియదా అని ప్రశ్నించారు. రాజేంద్రనగర్, చేవెళ్ల, షాద్‌నగర్, మక్తల్ తదితర ప్రాంతాల రైతులు, రైతు నాయకులతో పాలకమండలిని భర్తీ చేస్తారని ఆయన అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, వినోద్‌సింగ్, అబ్దుల్ అమీద్, గజ్రే కిషన్, షకీలా, వనజ తదితరులున్నారు.

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలి



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్

యాకుత్‌పురా: అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. శనివారం మొఘల్‌పురా డివిజన్‌లోని జహంగీర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఆయన కార్పొరేటర్ నస్రీన్ సుల్తానా, పలువురు అధికారులతో కలిసి స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. బస్తీల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు.

అగ్ని ప్రమాదం



అబిడ్స్: నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఇస్కాన్ ఆలయం సమీపంలో ఉన్న టై అండ్ బెల్ట్ దుకాణాల్లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ ఇమాన్యూయేల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్కాన్ ఆలయం పక్కనే ఉన్న కింగ్స్ బెల్ట్, అమెరికన్ టై అండ్ బెల్ట్ దుకాణాల్లో శనివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు ఫైర్ ఇంజన్‌ను రప్పించి మంటలను ఆర్పించారు. రెండు దుకాణాల్లో దాదాపు రూ.20 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సత్కారం



శాసనమండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్‌కు కేలండర్‌ను అందజేస్తున్న వెంకటేశ్

గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, లాల్‌దర్వాజా సింహవాహిణీ మహంకాళి ఆలయ మాజీ చైర్మన్ కె.వెంకటేశ్ ఘనంగా సన్మానించారు. శనివారం శాసన మండలిలోని చైర్మన్ కార్యాలయంలో గుత్తా సుఖేందర్ రెడ్డి, బండ ప్రకాశ్‌ను వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిసి అమ్మవారి శేష వస్త్రంతో సన్మానించారు. అనంతరం లాల్‌దర్వాజా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను వారికి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కీర్తి రాజ్ గోపాల్ పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌కు పోటెత్తిన సందర్శకులు



అబిడ్స్: ఎగ్జిబిషన్‌కు సందర్శకులు పోటెత్తారు. 84 అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన శాల (నుమాయిష్)కు శనివారం దాదాపు 70 వేల మంది సందర్శకులు తరలివచ్చారు. జనవరి 3న ప్రారంభమైన ఎగ్జిబిషన్‌కు వీకెండ్ సెలవు దినాల్లో సందర్శకులు పోటెత్తుతున్నారు. ప్రభుత్వ స్టాళ్లతో పాటు ప్రైవేటు స్టాల్స్ సందర్శకులతో కిక్కిరిసిపోయాయి. శనివారం రాత్రి వరకు ఎగ్జిబిషన్‌ను 6.70 లక్షల మంది సందర్శించారని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి సురేందర్ రెడ్డి, బుక్కింగ్ కన్వీనర్ వనం సత్యేందర్ తెలిపారు. అమ్యూజ్‌మెంట్ విభాగంతో పాటు చుక్ చుక్ రైల్‌లో సందర్శకులు ఎంజాయ్ చేశారు. ఎగ్జిబిషన్ అజంత గేట్, గాంధీభవన్, గోషామహల్ గేట్ల వద్ద భారీ ఎత్తున పోలీసు బందోబస్తును అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి



మౌలానా ఉబేద్దుల్లా ఆజ్మీతో మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి లభిస్తుందని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వైస్ ప్రెసిడెంట్ మౌలానా ఉబేద్దుల్లా ఆజ్మీ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీలోని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టీఎఫ్‌సీఓ చైర్మన్ మహ్మద్ నజీబ్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు వర్గాలకు సేవ చేయడం ఒక గొప్ప కార్యం అని అన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు సయ్యద్ ఫయాజ్, నయీముద్దీన్ జావేద్ తదితరులున్నారు.

రైతులకు అండగా ఉంటాం



రఘుపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీకిషన్ గజరే తదితరులు

జియాగూడ: గుడిమల్కాపూర్ మార్కెట్ యార్డ్‌కు వచ్చే రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటామని మార్కెట్ నూతన డైరెక్టర్ రఘుపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ పార్టీ జియాగూడ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీకిషన్ గజరే ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నూతన డైరెక్టర్ కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీకిషన్ గజరే మాట్లాడుతూ..కార్వాన్ నుంచి రఘుపాల్‌రెడ్డికి ఇవ్వడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు కురకుల కృష్ణ, యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల భద్రత అందరి బాధ్యత



అనంత్‌కృష్ణను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జియాగూడ: ఆలయాల భద్రత అందరి బాధ్యతగా భావించాలని బీజేవైఎం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పడాల అనంత్‌కృష్ణ అన్నారు. ఈ మేరకు శనివారం కార్వాన్ బాంజవాడిలోని బంగారు మైసమ్మ ఆలయంలో ఆలయ భద్రత కోసం సుమారు రూ.30 వేలతో సొంతంగా నాలుగు ఇంటర్నెట్ ప్రొటోకాల్ కెమెరాలను ఏర్పాటు చేయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ, కె.భిక్షపతి, జింక కృష్ణ, మాడిశెట్టి శ్రీనివాస్, ఎ.కృష్ణ, యాదగిరి, ముల్లె నిఖిలేష్, క్రాంతి, సురేష్, శివ, వినాయకరావు పాల్గొన్నారు.

దుకాణాల వేలానికి అనుమతించండి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

చార్మినార్: పిల్లి గుడిసెలు డబుల్ బెడ్ రూంలోని దుకాణాల కిరాయిదారులు నెలవారి కిరాయిలు చెల్లించకపోవడంతో మెయింటెనెన్స్ సమస్యలు తలెత్తుతున్నాయని పిల్లి గుడిసెలు 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. వేలం వేసేందుకు అనుమతించాలని కోరుతూ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ మస్తాన్, సంయుక్త కార్యదర్శి తాహెర్, కోశాధికారి పిల్లి రామచందర్ తదితరుల బృందం జీహెచ్ఎంసీ మలకపేట్ సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్‌ను కోరింది. ఈ మేరకు మళ్లీ ఓపెన్ ఆక్షన్ నిర్వహించేందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి తీర్మానించినట్లు ప్రతినిధుల బృందం ఆయనకు వివరించింది. అసోసియేషన్ తీర్మానించిన కాపీతో పాటు వినతిపత్రాన్ని డిప్యూటీ కమిషనర్ జయంత్‌కు అందజేశారు.

మత్స్య మహిళల జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మెట్టు సాయికుమార్ తదితరులు

విజయనగర్‌కాలనీ: బీజేపీ ప్రభుత్వం తెలంగాణలోని మత్స్యకారులపై వివక్ష చూపుతుందని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. శనివారం విజయనగర్‌కాలనీలో ఉన్న మత్స్యశాఖ రాష్ట్ర కార్యాలయంలో వచ్చే నెల 8న నిర్వహించే మత్స్య మహిళల జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అఖిల భారత మత్స్యకారుల మత్స్యకార్మిక సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాతీయ సదస్సు వేదిక కావడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మహిళా మంత్రులు సీతక్క, కొండా సురేఖ తదితరులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ, మత్స్య మహిళా ఆర్గనైజింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పద్మ, మత్స్య కార్మిక సంఘం మహిళా ఆర్గనైజింగ్ రాష్ట్ర కో కన్వీనర్ బాలమణి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కో కన్వీనర్ నవనీత, హైదరాబాద్ జిల్లా డైరెక్టర్ అరుణ, శ్రీను స్వరూప పాల్గొన్నారు.

ఆంధ్రనాట్యాభివృద్ధికి స్వరనర్తన కృషి ప్రశంసనీయం



విజేతలతో సబితా భమిడిపాటి, నళినీమోహన్, డాక్టర్ కళాకృష్ణ

నాంపల్లి: స్వర నర్తన అకాడమీ స్థాపకులు పద్మా మోహన్ దెందులూరి ఆధ్వర్యంలో ఆంధ్రనాట్య గురువు డాక్టర్ కళాకృష్ణ మార్గదర్శకత్వంలో స్వర నర్తన నృత్యం, సంగీతం, యోగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ సభ జరిగింది. శనివారం రాత్రి నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగిన కార్యక్రమానికి విశ్రాంత ఏపీ అటవీ ప్రధాన సంరక్షణాధికారి డాక్టర్ దెందులూరి నళినీ మోహన్ అధ్యక్షత వహించారు. ప్రసిద్ధ నాట్యకారిణి సబితా భమిడిపాటి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గురువులకు, విజేతలకు బహుమతులను అందజేసి ప్రసంగించారు. ఆంధ్రనాట్య అభివృద్ధికి స్వరనర్తన సంస్థ ఎంతగానో కృషి చేస్తోందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ డి.ఉమామహేశ్వరితో పాటుగా పలువురు కళాకారులు, గురువులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో నిరంతర విద్యుత్ సరఫరా



సుఖేష్‌రెడ్డి

అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో సందర్శకుల సౌకర్యార్థం నిరంతర మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఎలక్ట్రిసిటీ సబ్ కమిటీ కన్వీనర్ ఆర్.సుఖేష్ రెడ్డి వెల్లడించారు. ఎగ్జిబిషన్ లోపల, ఎగ్జిబిషన్ పరిసరాల్లో సైతం దాదాపు 2 నుంచి 3 వేల హైలోజెన్ లైట్ల ద్వారా విద్యుత్ సరఫరా అందిస్తున్నామన్నారు. శనివారం విద్యుత్ సబ్ కమిటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ల ద్వారా టీజీఎస్‌పీడీసీఎల్ తమకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తుందన్నారు. ఆ సబ్‌స్టేషన్ల ద్వారా ఎగ్జిబిషన్‌లోని స్టాళ్లకు, పార్కింగ్ ప్రాంతాల్లో ఎగ్జిబిషన్ నలుమూలాలా తాము నిరంతర విద్యుత్ సరఫరా చేపడుతున్నామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 10:30 గంటల వరకు, శనివారం, ఆదివారం రోజుల్లో సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఇస్తున్నామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ముందు జాగ్రత్త చర్యగా ఎగ్జిబిషన్ నలుమూలలా 6 జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరా పంపిణీ చేస్తామన్నారు. ఎగ్జిబిషన్ అజంత గేటు నుంచి మెట్రోరైల్ స్టేజ్ వరకు, గాంధీభవన్ సమీపం వరకు, పరిసర పార్కింగ్ ప్రాంతాల్లో సైతం తాము నిరంతర విద్యుత్ సరఫరా చేపడుతున్నట్లు తెలిపారు.

బీజేపీ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడిగా రాకేష్



గోల్కొండ: బీజేపీ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడిగా పూస రాకేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ..15 ఏళ్లుగా పార్టీలో పని చేస్తున్నానన్నారు. యూత్ విభాగం నుంచి క్రియాశీలకంగా ఉంటున్నానన్నారు. షేక్‌పేట్‌లో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



చాంద్రాయణగుట్ట: ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఆడాల శివ కుమార్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సరం కేలండర్‌ను తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి కార్మికుడికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. టీఎన్‌జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి.సత్యనారాయణ, నాయకులు అనిల్ కుమార్, జయేందర్, శ్రీనివాసారావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి

అబిడ్స్: కళాకారులను ప్రోత్సహించాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌లో ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఒక్కో కళాత్మక చిత్రాల్లో ఎంతో నైపుణ్యత దాగి ఉంటుందన్నారు. కళాకారులకు అన్నివర్గాల వారు ప్రోత్సహించినప్పుడే కళారంగం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ..84 ఏళ్లుగా తమ ఆర్ట్ స్టాల్‌ను ఏర్పాటు చేసి కళాత్మక చిత్రాలను ప్రదర్శిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ సొసైటీ సబ్ కమిటీ కన్వీనర్ సామల వేణు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోలీస్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి